క్లుప్తంగా

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



సామగ్రిని అందజేస్తున్న జమాల్‌ఖాన్

ఎటపాక: మండలంలోని నల్లకుంట, గన్నవరం గ్రామాల్లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు జేకే చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంటి సామగ్రిని అందజేశారు. నల్లకుంటలో ఉయిక ఇరమయ్య, తెల్లం రాములమ్మ, గన్నవరంలో కారం రవిల ఇళ్ల నిర్మాణానికి సిమెంట్ రేకులు, ఐరన్ పైపులను ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్ మంగళవారం పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, సర్పంచ్ ఉలవల శివకనకరాజు, మాజీ ఎంపీటీసీ సూర్యనారాయణ, జంపన్న, నాగేశ్వరరావు, మధు, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ రామారావుకు అభినందనలు



రామారావు

రాజవొమ్మంగి: మండలంలోని లోదొడ్డి పంచాయతీ సర్పంచ్ లోతా రామారావు సీపీఎం రాష్ట్ర స్థాయి పదవికి ఎంపిక అయ్యారు. ఆయనను సీపీఎం రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడిగా సోమవారం పార్టీ నియమించింది. ఆయన పార్టీకు చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ పదవి దక్కినట్లు స్థానిక నాయకులు పేర్కొన్నారు. రామారావును స్థానిక నాయకులు రామరాజు, జగన్నాథం, సత్యనారాయణ, పాపారావు, బాబూరావు, అచ్చారావు తదితరులు కలిసి అభినందనలు తెలిపారు.

వంతెన నిర్మించాలని వినతి

కొయ్యూరు: మండలంలోని రత్నంపేట, పాడిమద్యలో పాడైన వంతెన కూల్చివేసి ఆ స్థానంలో కొత్తది నిర్మించాలని తోడు స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు ఎం.మురళీకృష్ణ కోరారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ వర్షాలు కురిసినపుడు వరద ఉధృతికి రాకపోకలు నిలిచిపోతున్నాయన్నారు. గతేడాది కురిసిన భారీ వర్షాలకు వంతెన దెబ్బతిందన్నారు. ఈ మేరకు వంతెన నిర్మించాలని కోరుతూ అధికారులు, టీడీపీ నాయకులకు వినతిపత్రం అందజేశామన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీజేపీ నేతలు

కొయ్యూరు: నీటి ట్యాంకర్ బోల్తా పడి మృతి చెందిన గలివెరి నాగరాజు కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని రాష్ట్ర ట్రైకార్ డైరెక్టర్ కూడా కృష్ణారావు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో బీజేపీ నేతలు మంగళవారం ఎం.మాకవరం గ్రామంలోని మృతుడు నాగరాజు కుటుంబాన్ని కలిసి పరామర్శించారు. నాగరాజు భార్య భారతిని ఓదార్చారు. ఆయన మాట్లాడుతూ పార్టీ తరఫున బాధితుడి కుటుంబానికి అండగా నిలుస్తామన్నారు. అల్లూరి గిరిజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు శ్యామల వరలక్ష్మి, నేతలు శివకుమార్, చంద్రరావు, రాజు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు

73 మందికి వైద్య సేవలు



శరభవరంలోని శిబిరంలో రోగులకు మందులు అందజేస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని శరభవరం గ్రామం రామాలయం వద్ద మంగళవారం జరిగిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో 73 మందికి వైద్యసేవలు అందజేసినట్టు సిబ్బంది తెలిపారు. గర్భిణులు, బాలింతలను పరీక్షించినట్టు చెప్పారు. సుగర్, బీపీ సమస్యలు ఉన్న వారికి ఉచితంగా మందులు అందజేశామన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ రామారావు, ఏఎన్‌ఎంలు సత్య, సరస్వతి, 104 డీఈఓ శ్రీనివాస్, పైలెట్ కనకరాజు, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

సీలేరు: సీలేరు మార్కెట్‌లో ఉన్న బస్ షెల్టర్ నిర్మాణాన్ని కూటమి నాయకులు అడ్డుకున్నారని ప్రకటన అవాస్తవమని నేతలు మంగళవారం ఆరోపించారు. సీలేరులో బస్‌షెల్టర్ పాడైందని, దానికి మరమ్మతు చేసి, ఆయా నిధులను పంచాయతీ అభివృద్ధికి ఉపయోగించాలని సూచించారు. బస్‌షెల్టర్ నిర్మాణాన్ని అడ్డుకుంటున్నట్టు కారే శ్రీనివాస్ వ్యాఖ్యలు చేయడం సబబు కాదన్నారు. పంచాయతీ అభివృద్ధికి అధికారులు నిధులు కేటాయించాలన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



గూడెంకొత్తవీధిలో మానవహారం



కూనవరంలో మానవహారం నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



పెదబయలు కూడలిలో మానవహారం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



కిల్లోగుడ పీహెచ్‌సీ వద్ద మానవహారం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పెదబయలు: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల్లోని వైద్యాధికారుల ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ర్యాలీలు, మానవహారాలు చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు, వైద్యులు, ప్రముఖులు మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ధూమపానం, మద్యపానం, ఖైనీ, గుట్కా వంటివి తీసుకోవడం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. వివిధ రకాల క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించడానికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నారన్నారు. 30 సంవత్సరాల వయస్సు దాటిన ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలన్నారు. రోగం లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. రోగాన్ని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే త్వరితగతిన నయం చేయవచ్చన్నారు. క్యాన్సర్‌పై అవగాహన పెంచుకుందాం.. ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రోత్సహిద్దాం అంటూ వైద్య సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు నినాదాలు చేశారు. క్యాన్సర్ మహమ్మారిని పారద్రోలేందుకు అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పెదబయలులో జరిగిన కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: దుంబ్రిగుడ, కిల్లోగుడ పీహెచ్‌సీల్లో జరిగిన కార్యక్రమాల్లో వైద్యాధికారులు పి.రాంబాబు, నజీమ్, అంబికా రమణి, కుమార్‌రత్న, ఎంపీహెచ్‌ఈవో సారీ, రామరావు, హెచ్‌వీలు పద్మా, హెల్త్ ఆసిస్టెంట్‌లు స్వామి, ప్రభాకర్, సంజీవ్, రవీంద్ర, లోవరాజు, హెచ్‌వీలు జానకి, నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

సీలేరు: దారకొండలో జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారి మస్తాన్ వల్లీ, దారకొండ టీబీ సూపర్‌వైజర్ అశోక్ కుమార్, సబ్ యూనిట్ ఆఫీసర్ కన్నబాబు, ఆరోగ్య పర్యవేక్షకులు, బాలామణి, త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: మండలంలో జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారి అచ్యుత్, ఈవో సింహాచలం, పీహెచ్‌ఎన్ ద్వారకాభాయ్, ఎంటీఎస్ శ్రావణి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎటపాక: మండలంలోని జరిగిన కార్యక్రమంలో డాక్టర్ దేవినాగ్, సిబ్బంది నవీన్, నాగమణి, హెచ్‌ఎం కణితి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: మండలంలోని దుప్పులపాలెంలో జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారి స్పందన, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారి యామినిప్రియ తదితరులు పాల్గొన్నారు.

కూనవరం: మండలంలోని జరిగిన కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ సునీల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి సురేష్, హెల్త్ సూపర్ వైజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



జద్దంగిలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది



క్యాన్సర్‌పై నినాదాలు చేస్తున్న దుంబ్రిగుడ పీహెచ్‌సీ సిబ్బంది



దారకొండలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది



గౌరీదేవిపేటలో అవగాహన ర్యాలీ



దుప్పులపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పార్టీ కోసం పనిచేసే వారికి తప్పనిసరిగా గుర్తింపు



అనుబంధ విభాగ అధ్యక్షులను సన్మానిస్తున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అరకులోయ టౌన్: అరకు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు మంగళవారం అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా అరకు నియోజకవర్గం ఎస్టీ సెల్ అధ్యక్షుడు రేగబోయిని స్వామి, రైతు విభాగం అధ్యక్షుడు రమ్మాల రామన్న దొర అరకులోయలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మత్స్యలింగంను కలిసి అనుబంధ విభాగాల్లో అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అరకు నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతానికి కృషి చేస్తామన్నారు. అరకు ఎమ్మెల్యే వారికి శాలువా కప్పి ఘనంగా సన్మానించి, అభినందించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తే తప్పనిసరిగా గుర్తింపు ఉంటుందన్నారు. అనంతగిరి మాజీ జెడ్పీటీసీ దూరు గంగన్నదొర, సర్పంచ్‌లు పెంటమ్మ, గణేష్, అన్నపూర్ణదేవి, సింహాద్రి, రాష్ట్ర ఎస్టీ సెల్ సంయుక్త కార్యదర్శి గంగరాజు, నాయకులు గంగన్న, రామ్ నాయుడు, కొండబాబు, భీమయ్య, సన్యాసి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



పెదబయలు బజార్‌లో కళాజాత ద్వారా అవగాహన కల్పిస్తున్న కళాకారులు

పెదబయలు: ప్రజలు ఆర్థిక అక్షరాస్యత సాధించి బ్యాంకు సేవలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని రూడకోట స్టేట్ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ వెంకటేశ్వరరావు అన్నారు. బ్యాంకు పరిధిలోని పెదబయలు బజార్, రోగులపేట, ఏపీ గురుకుల కళాశాల, కేజీబీవీ పాఠశాలల్లో రాజమండ్రి కళాకారులచే మంగళవారం కళాజాత నిర్వహించారు. ఎస్‌బీఐ అందిస్తున్న పథకాలు, బీమా సదుపాయాలు, రుణాలపై నాటికల రూపంలో అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని బ్యాంకు అధికారులు సూచించారు. ఫీల్డ్ ఆఫీసర్ చాణక్య, గ్రామ పెద్దలు చిన్ని, కొండబాబు, చిరంజీవి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



ఎస్‌బీఐ ఖాతాదారుల సేవా కేంద్రాన్ని సందర్శించిన తహసీల్దార్ శ్రీనివాసరావు

గంగవరం : సీఎస్‌పీల ద్వారా మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించాలని తహసీల్దార్ సీహెచ్.శ్రీనివాసరావు స్టేట్ బ్యాంక్ ఖాతాదారుల సేవ కేంద్రం సిబ్బందికి సూచించారు. గంగవరంలో ఎస్‌బీఐ ఖాతాదారుల సేవా కేంద్రాన్ని ఆయన మంగళవారం ఆకస్మికంగా సందర్శించి, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. నిరంతరం ప్రజలకు బ్యాంకింగ్ సేవలను ఈ కేంద్రాల ద్వారా అందించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఏ రమేష్, సిబ్బంది ఉషశ్రీ తదితరులున్నారు.

సమస్యల పరిష్కారంలో అధికారులు విఫలం



రాధాకృష్ణ

పాడేరు రూరల్: భూ సమస్య పరిష్కరించాలని కోరుతూ హుకుంపేట మండల కేంద్రంలో గత నాలుగు చేస్తున్న ఓ గిరిజన మహిళ నిరసన చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమని గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ చెప్పారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ గిరిజన మహిళ తన స్థలాన్ని తనకు అందజేయాలని చంటి బిడ్డతో ఒంటరిగా టెంటు వేసుకుని నిరసన చేస్తున్నా, అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరించడం దారుణమన్నారు. తక్షణం గిరిజన మహిళ స్థలాన్ని తిరిగి అప్పగించి, ఆక్రమించుకున్న గిరిజనేతరులపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ప్రజా సంఘాల మద్దతుతో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



కుసుమరాయి బ్రిడ్జి వద్ద బోల్తా పడిన కారు

గంగవరం : గంగవరం–కుసుమరాయి మధ్య కుసుమరాయి జంక్షన్‌కు సమీపంలో ఉన్న వంతెన వద్ద ఓ కారు అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఓ వ్యక్తి కారులో ఏలూరు నుంచి వై.రామవరం వెళ్తుండగా కుసుమరాయి జంక్షన్ వద్ద వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో ఆ వ్యక్తికి గాయాలు కాలేదు. సురక్షితంగా బయటపడ్డాడు. స్థానికుల సహాయంతో ఆ కారును బయటకు తీశారు.

ఏలియా మాస్టారు మృతికి సంతాపం



భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ టౌన్: కొర్రా ఏలియా మాస్టారు మృతి గిరిజన సమాజానికి తీరనిలోటని అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. ఆయన మంగళవారం మండలంలోని శరభగుడలోని మాస్టారు స్వగ్రామంలో ఏలియా భౌతికకాయానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గిరిజన సమాజం మంచి ఉపాధ్యాయుడిని కోల్పోయిందని, మాస్టారు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. నాయకులు పాల్గొన్నారు. ఏలియా మాస్టారు మృతికి పలువురు సంతాపం తెలిపారు.

తునికాకు సేకరణ చేపట్టాలని డిమాండ్

రంపచోడవరం: ఏజెన్సీలో తునికాకు సేకరణ చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పన కిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి మొదటి వారం గడుస్తున్నప్పటికీ నేటికి తునికాకు సేకరణకు టెండర్లు పూర్తి కాలేదన్నారు. తునికాకు పనులు వెంటనే చేపట్టాలని, దీనిపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించాలన్నారు. వి.ఆర్.పురం, చింతూరు, కూనవరం, ఎటపాక, రంపచోడవరం ప్రాంతాల్లో లక్షలాది మంది ప్రజల ఉపాధి దెబ్బతినేటట్టు ఉందన్నారు. ఇప్పటికే ప్రూనింగ్ పనులు చేపట్టవలసిన అవసరం ఉందన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో తునికాకు దొరికే ప్రాంతాల్లో కార్మికుల ఉపాధి కోల్పోకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. టెండర్లు నిర్వహించకపోతే అటవీ శాఖ నేరుగా తునికాకు సేకరించవచ్చన్నారు. సత్వరమే నిర్ణయం తీసుకోవాలని కోరారు.

న్యాయం చేయాలని వినతి



శిబిరంలో దీక్ష చేస్తున్న భూబాధితులు

దుంబ్రిగుడ: మండలంలోని ఏకలవ్య పాఠశాల నిర్మాణం కోసం భూములు ఇచ్చిన భూ బాధితులు చేపడుతున్న దీక్ష మంగళవారం నాటికి 12వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బాధితులు తమకు న్యాయం చేయాలని కోరుతూ ఇన్‌చార్జి తహసీల్దార్ ముజీబ్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. వీరికి మద్దతుగా వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ మొద్దు, మాజీ ఎంపీటీసీ రాందాస్, కాంగ్రెస్ నాయకుడు దయానిధి తదితరులు పాల్గొన్నారు. భూ బాధితులు వంటా–వార్పు కార్యక్రమం చేపట్టి అధికారుల తీరుపై నిరసన తెలిపారు.

జోరుగా పనులు

- కాకరపాడు నర్సరీ ఏర్పాటుకు చర్యలు
- లక్ష మొక్కల పెంపకమే లక్ష్యం



కాకరపాడు నర్సరీ ఏర్పాటు పనులు

కొయ్యూరు: కాకరపాడు నర్సరీలో రైతులకు పంపిణీ చేసేందుకు అవసరమైన వివిధ రకాల పండ్ల మొక్కలను పెంచుతున్నారు. ఉపాధి హామీ పథకం నిధులతో నర్సరీని నిర్వహిస్తున్నారు. ఇందుకు అవసరమైన పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. కూలీలతో మట్టిని మెత్తగా చేసి కవర్లలో ఉంచేందుకు ఏర్పాటు చేస్తున్నారు. ఉపాధి హామీ నిధులతో రైతులకు ఆర్థిక తోడ్పాడు అందించేందుకు యంత్రాంగం పండ్ల మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జాఫ్రా, సిల్వర్ ఓక్ మొక్కలను 70 వేల వరకు వేయనున్నారు. జాఫ్రాతో రైతులకు ఎక్కువగా లాభాలు రావడంతో ఆ పంట మొక్కల పంపిణీకి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు. పనస, సీతాఫలం, జామ, జీడి మొక్కలు వేయనున్నారు. ఈ ప్రాంతం జీడి సాగుకు అనుకూలంగా ఉంటుంది. దీంతో రైతులకు అవసరమైన చోట్ల మొక్కలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

జూలైలో పంపిణీ

ఈ ఏడాది జూలై నాటికి మొక్కలు సిద్ధంగా ఉంటాయని అధికారులు చెబుతున్నారు. రైతులకు అవసరమైన మొక్కలను ఉచితంగా నర్సరీ నుంచి పొందవచ్చని చెబుతున్నారు. రైతుల తమ భూ పట్టాలను తీసుకువచ్చి వారికి అవసరమైన మొక్కలను తీసుకెళ్లొచ్చని చెబుతున్నారు. ఎక్కువ మంది రైతులు పండ్లజాతుల మొక్కల పెంపకానికి సంసిద్ధత వ్యక్తం చేస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.

పెంపకానికి ప్రత్యేక చర్యలు



కాకరపాడు నర్సరీలో పెంచుతున్న ఆరు రకాల మొక్కలను రైతులకు ఉచితంగా ఇస్తాం. జూలై నాటికి మొక్కలు సిద్ధంగా ఉంటాయి. ఇప్పటి నుంచే నర్సరీలో మొక్కలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఉపాధిహామీ నిధులతో పనులు చేపట్టాం.

– శివ రజని, పెదవలస రేంజర్

గిరిజనులందరికీ గృహాలు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ సత్యనారాయణ

ముంచంగిపుట్టు: గిరిజన తెగలకు చెందిన అన్ని సామాజిక వర్గాలకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న ప్రధాన మంత్రి గ్రామీణ ఆవాస్ యోజన పథకం ద్వారా గృహాలు మంజూరు చేయాలని వైస్ ఎంపీపీ పి.సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలో గిరిజన సంఘం నేతలు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ సత్యనారాయణ మాట్లాడుతూ ఏజెన్సీలో అన్ని సామాజిక వర్గాలకు చెందిన గిరిజనులకు గృహాల నిర్మాణానికి మంజూరు చేసి, నిధులు పెంచాలన్నారు. ప్రస్తుతం అందజేస్తున్న రూ.2.39లక్షలు గృహాల నిర్మాణానికి సరిపోవడం లేదని, రూ.5లక్షలు చొప్పున మంజూరు చేయాలన్నారు. గృహాల సర్వేను వేగవంతం చేయాలని, హౌసింగ్ సిబ్బంది తక్కువగా ఉండడంతో సర్వే ఆలస్యమవుతుందని, సిబ్బందిని పెంచాలని, గతంలో మంజూరు చేసిన ఎన్‌టీఆర్ గృహాలకు సైతం బిల్లులు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. నేతలు శ్రీను, గాసిరాందొర తదితరులు పాల్గొన్నారు.

68 మందికి కంటి వైద్య పరీక్షలు



శస్త్ర చికిత్స అవసరమైన వారిని బస్సులో విశాఖకు తరలిస్తున్న వైద్య సిబ్బంది

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో మంగళవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో విశాఖపట్నం తగరపువలసకు చెందిన అనిల్ నీరుకొండ ఆస్పత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 68 మందికి కంటి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు.ఈ సందర్భంగా మండల ఆప్తామాలిక్ అసిస్టెంట్ కిషోర్‌కుమార్ మాట్లాడుతూ శిబిరానికి వచ్చిన వారిలో తీవ్రమైన కంటి సమస్యతో బాధపడుతున్న 9 మందికి శస్త్రచికిత్స అవసరమున్నట్టు గుర్తించి, వారిని ప్రత్యేక బస్సులో విశాఖపట్నం తరలించినట్టు తెలిపారు. శస్త్ర చికిత్స సమయంలో వారికి ఉచితంగా భోజనం, వసతి కల్పించనున్నట్టు చెప్పారు. వైద్యులు శిరీష, గీతాంజలి, సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యన్నపాత్రుడిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



అమీనాబాద్ సమావేశంలో నినాదాలు చేస్తున్న నాయకులు



జి.మాడుగులలో ర్యాలీ నిర్వహిస్తున్న పీసా కమిటీ నాయకులు, సభ్యులు

రాజవొమ్మంగి: గిరిజన చట్టాల జోలికి వస్తే సహించేది లేదని, శ్రీకాకుళం థర్మల్ ప్లాంట్ ప్రతిపాదన వెంటనే ఆపాలంటూ మంగళవారం ఏపీ ఆదివాసీ సంక్షేమ పరిషత్ హెచ్చరించింది. మండలంలోని అమీనాబాద్‌లో సంఘం నాయకులు మంగళవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కుంజం శ్రీను మాట్లాడుతూ గిరిజన చట్టాలపై అవహేళనగా మాట్లాడిన స్పీకర్ అయ్యన్నపాత్రుడిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. నేడు పాలకులు, అధికారులు గిరిజనేతరులకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పోలవరం పేరుతో ఆ ప్రాంత ఆదివాసీల బతుకులను నాశనం చేశారన్నారు. ఆదివాసీలు తమ హక్కుల సాధనకై ఐక్యంగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. నాయకులు బాబూరావు, నూకరాజు, డివిజన్ ప్రదీప్‌కుమార్, ప్రసాద్, శ్రీను, సత్యబాబు, దేవి, బేబీ, పురుషోత్తం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జి.మాడుగుల: గిరిజన చట్టాలపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని పీసా కమిటీ ఉపాధ్యక్షుడు లకే రామకృష్ణ, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మన్నపడాల్, డీఎల్‌వో రాష్ట్ర అడ్వైజర్ మాణిక్యం, బీజేవైఎం నాయకుడు రాజన్ డిమాండ్ చేశారు. అయ్యన్నపాత్రుడి వ్యాఖ్యలపై వారు మంగళవారం మండల కేంద్రంలో నిరసన ర్యాలీ చేపట్టారు. లువ్వాసింగి ఎంపీటీసీ సభ్యుడు సన్యాసిదొర, నాయకులు శంకయ్య, చిరంజీవినాయుడు, లక్ష్మణరావు, చంద్రమోహన్, మణికంఠ, చిట్టినాయుడు, కృపారావు, చిన్నారావు తదితరలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



చేతి బోరును ప్రారంభిస్తున్న నేత అర్జున్‌దొర

ఎటపాక: ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఓ దాత స్వచ్ఛందంగా బోర్ వేయించి చేతిపంపు ఏర్పాటు చేశారు. లక్ష్మీపురం గ్రామంలో సచివాలయం పక్కన ఉన్న వీధిలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉండడంతో స్థానికులు పలుమార్లు అధికారులకు వినతులు అందజేశారు. అయినా స్పందించకపోవడంతో గ్రామానికి చెందిన పూనెం వెంకటరావు తన సొంత నిధులు సుమారు రూ.80వేలు వెచ్చించి చేతిబోరును ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమవడంపై స్థానికులు ఆయనను అభినందించారు. ఈ చేతిబోరును మంగళవారం సీపీఎం మండల కార్యదర్శి కాక అర్జున్‌దొర చేతుల మీదుగా ప్రారంభించారు. రాము, సూరిబాబు, రమేష్, జంపయ్య, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.